## 11

# మంచి సైనికునియొక్క నమ్మిక

*"కాబట్టి నీవు మన ప్రభువు విషయమైన సాక్ష్యమును గూర్చియైనను, ఆయన ఖైదీనైన నన్ను గూర్చియైనను సిగ్గుపడక, దేవుని శక్తినిబట్టి సువార్త నిమిత్తమైన శ్రమాను భవములో పాలివాడవై యుండుము. మన క్రియలనుబట్టి కాక తన స్వకీయ సంకల్పమును బట్టియు, అనాదికాలముననే క్రీస్తుయేసునందు మనకు అనుగ్రహింపబడినదియు, క్రీస్తుయేసను మన రక్షకుని ప్రత్యక్షతవలన బయలుపరచబడునదియునైన తన కృపను బట్టియు, మనలను రక్షించి పరిశుద్ధమైన పిలుపుతో ఆయన మనలను పిలిచెను. ఆ క్రీస్తుయేసు మరణమును నిరర్థకము చేసి, జీవమును అక్షయతను సువార్తవలన వెలుగులోనికి తెచ్చెను. ఆ సువార్త విషయములో నేను ప్రకటించువాడనుగాను, అపొస్తలుడను గాను, బోధకుడనుగాను నియమింపబడితిని. ఆ హేతువుచేత ఈ శ్రమలను అనుభవించు చున్నాను గాని, నేను నమ్మినవాని ఎరుగుదును గనుక సిగ్గుపడను; నేను ఆయనకు అప్పగించినదానిని రాబోవుచున్న ఆ దినమువరకు ఆయన కాపాడగలడని రూఢిగా నమ్ముకొనుచున్నాను" (2 తిమోతి 1:8-12).*

"విశ్వాస సంబంధమైన మంచి పోరాటము పోరాడుము" అని వృద్ధుడైయున్న అపొస్తలుడైన పౌలు, విశ్వాసమునందు తన నిజ కుమారుడును, యువకుడునైన తిమోతికి వ్రాశాడు (1 తిమోతి 6:12). క్రైస్తవ జీవితం ఒక రణరంగం, భూమిమీద ఎన్నడూ జరుగనంత ఘోరమైన యుద్ధమది. టాంకులు, తుఫాకీలు, మిసైళ్లుతో చేసే యుద్ధం కాదు, ఆత్మసంబంధమైన రెండు నిత్య శక్తుల మధ్య – దేవుడు, సాతానుల మధ్య పోరాటమది. తప్పు ఒప్పుల మధ్య, మంచి చెడ్డల మధ్య, అబద్ధము సత్యముల మధ్య, చీకటి వెలుగుల మధ్య, నరకము పరలోకముల మధ్య జరిగే పోరాటమది. మనం దాన్ని గుర్తించినా గుర్తించక పోయినా, మనలో ప్రతి ఒక్కరం అందులో వ్యక్తిగతంగానే దిగియున్నాం. నీవు, నేను: అపవాది, లోకము, శరీరమనే ముగ్గురు శత్రువులను ఎదుర్కొంటున్నాం. అపవాది పాతాళ సంబంధియైన శత్రువు – అంధకార సంబంధమైన తన రాజ్యంనుండి పోరాటం సాగిస్తున్నాడు. లోకము బాహ్యమైన శత్రువైయుండి, తన శరీరాశ, నేత్రాశ, జీవపు డంబములచేత మనలను లాలన చేస్తూ అనుదిన జీవితంలో మనలను తన కొరకు గెలుచుకోవాలనుకొంటుంది. శరీరం అంతరంగ శత్రువు – పాప స్వభావము గలదై మన శత్రువులను మనం గ్రహించినప్పుడు, మనం ఎంత బలహీనులమో, ఆత్మసంబంధమైన ఈ పోరులో గెలుపొందడానికి దైవికమైన జోక్యం మనకెంత అవసరమో ఎరుగుతాం. ఈ రణరంగంలో మనం జయమొందాలంటే మన విశ్వాసము మనయందు కాక, ప్రభువైన యేసునందు నిలపాలని (ముందుగా గ్రహించాం).

యౌవన సువార్తికుడైన తిమోతి ఈ యుద్ధాన్ని ఎన్నడు విస్మరింపవద్దని ప్రోత్సహించుతూ అపొస్తలుడైన పౌలు పరిశుద్ధాత్మచేత ప్రేరేపింపబడినవాడై 2 తిమోతి 1:8-12లోని మాటలను వ్రాశాడు. 8ఎ వచనంలో, "దేవుని శక్తినిబట్టి సువార్త నిమిత్తమైన శ్రమానుభవములో (తనతో) పాలివాడవై యుండుమని" అతడు తిమోతికి ఆజ్ఞాపిస్తాడు. మరో మాటల్లో చెప్పాలంటే, పోరు ఎంత ఘోరంగా రేగినా, యుద్ధ భూమినుండి వైదొలుగ వద్దు అని పౌలు అతనికి తెలియజేశాడు. "మనం రణరంగంలో ఉండగా, కష్టాలు బాధలు కలుగుతాయ్. వేదనలు వ్యాకులతలు ఉంటాయి, అయితే ఎన్నడు వదులుకోవద్దు! మన ప్రభువు విషయమైన సాక్ష్యమును గూర్చియైన ఆయన ఖైదీనైన నన్ను గూర్చియైనా సిగ్గుపడక సువార్త నిమిత్తమైన శ్రమానుభవంలో నాతో పాలివాడవై యుండు" (8బి వ.) అది సరియైన సవాలు! సవాలుతో పాటు, సత్యంకొరకు పోరాడ డంలో ప్రభువుయొక్క సైన్యంలో చేరిన ప్రతివానికి ఆత్మసంబంధమైన సాధనాలు లభ్యమౌతాయని అతడు తిమోతికి అభయమిచ్చాడు. ధైర్యంగల ఆయన సైనికులంగా ఉండేలా ఆత్మసంబంధమైన ఆధారాలను లేక సాధనాలను దేవుడు ఎలా దయచేస్తాడో మనం ఈ పాఠంలో గమనించబోతాం.

## దేవునియొక్క శక్తి (8 వ.)

ప్రభువైన క్రీస్తుయొక్క సైనికులకు లభ్యమయ్యే తొలి ప్రధాన ఆధారము "దేవుని శక్తి." తిమోతిని హెచ్చరించే పౌలుయొక్క మాటలను 8వ వచనంలో మరల గమనించు, "దేవుని శక్తినిబట్టి సువార్త నిమిత్తమైన శ్రమానుభవములో నాతో పాలివాడవై యుండుము" (ఒత్తి పలకడం నాది). ఆత్మ సంబంధమైన సాతాను బలముతో పోరాడడానికి దేవుని శక్తి అవసరం, మంచి పోరాటం పోరాడడానికి అవసరమైన శక్తిని ప్రసాదిస్తానని మన దేవుడు వాగ్దానం చేశాడు. మంచి పోరాటమంటే విశ్వాస సంబంధమైన పోరాటమేనని మనం గుర్తుంచుకోవాలి. శరీరాన్నిబట్టి జయమొందే యుద్ధం కాదది. తన సొంత ప్రయాసలవలన, స్వయం తీర్మానంవలన, ఆత్మ విశ్వాసంవలన, లేక మంచితనంవలన నరుడు అపవాదిని జయించలేడు. "నాకు వేరుగా ఉండి మీరేమియు చేయలేరు" అని ప్రభువు స్పష్టంగా తెలియజేశారు (యోహాను 15:5సి), మనం ఆయన మాటలు నమ్మవలసి యుంది!

రణరంగంలో దేవుని యొక్క శక్తి అవసరమైయుంటుందని ఎఫెసీ. 6:10లో పౌలు తెలిపాడు: "తుదకు ప్రభువుయొక్క మహా శక్తినిబట్టి ఆయనయందు బలవంతులై యుండుడి" సాతానుయొక్క శక్తులన్నిటిని ఎదిరించి నిలిచిన ప్రభువే మన ఆత్మసంబంధమైన బలాధారమైయున్నాడు, మరియు ఆయన శక్తి మనలో ప్రవహించడానికి మార్గం విశ్వాసమే. తన జీవితంలో ప్రభువు యొక్క శక్తిని పౌలు ఎరుగు. రోమా న్యాయ పీఠము యెదుట అతడు తీర్పుకై నిలువక ముందు యిలా వ్రాశాడు, "... ప్రభువు నా ప్రక్క నిలిచి నన్ను బలపరచెను ..." యిలా ధైర్యంగా పలికాడు, "ప్రభువు ప్రతి దుష్కార్యమునుండి నన్ను తప్పించి తన పరలోకపు రాజ్యమునకు చేరునట్లు నన్ను రక్షించును. యుగ యుగములు ఆయనకు మహిమ కలుగును గాక. ఆమెన్"

(2 తిమోతి 4:17, 18).

మనం పోరాడే యుద్ధం దేవునికి సాతానుకు మధ్యగల ఆత్మసంబంధమైన యుద్ధం, యిందులో గెలుపొందడానికి ఒకే ఒక మార్గము – అది ప్రభువైన యేసుక్రీస్తునందలి విశ్వాసంచేతనే! మన ఆత్మలను దోచుకొనజూచే అపవాది యొక్క (ఎటాక్స్) ఎదిరింపులను ఓడించడానికి గాను మనవైపు చూచుకొనడం మానాలి, ప్రభువు యొక్క మానవాతీత శక్తి మనకు సహాయపడునట్లు, ఆయనవైపు మనం చూడాలి. మనం ఎలాటి యుద్ధాన్ని ఎదుర్కోవలసివచ్చినా, ప్రభువు మన పక్షంగా నిలిచి, నిరంతరం మనం ఆయనతో ఉండేలా యింటికి తోడుకొని పోయే పర్యంతం ఆయన మనతో ఉంటానని వాగ్దానం చేసింది ఎంత గొప్ప సుసందేశం! పౌలు యొక్క విశ్వాసం అలాటిది, ఈ లోకాన్ని జయించిన విజయం అట్టి విశ్వాసమే.

## మన ఆత్మల రక్షణ (9-12 వచనాలు)

క్రైస్తవ సైనికులకు ధైర్యాన్ని ప్రసాదించే ఆత్మసంబంధమైన యితర దీవెనను (గూర్చి) 9వ వచనంలో పేర్కొన్నాడు: మన ఆత్మల రక్షణ. "మన క్రియలనుబట్టి కాక తన స్వకీయ సంకల్పమునుబట్టియు, అనాది కాలముననే క్రీస్తుయేసునందు మనకు అనుగ్రహింపబడినదియు, ... మనలను రక్షించి పరిశుద్ధమైన పిలుపుతో ఆయన మనలను పిలిచెను." విశ్వాసము ద్వారా కృపచేతనే క్రీస్తుయేసునందు రక్షణయను వరాన్ని దయచేసిన దేవునికి స్తోత్రం (ఎఫెసీ. 2:8).

సాతానుకు విరోధంగా చేసే పోరులో మనలను సంసిద్ధం చేసే దేవుని శక్తియే, పాపములనుండి మన ఆత్మలను రక్షిస్తుంది, దేవుని నిత్య సైన్యపు జాబితాలో మనలను చేర్చుతోంది. "లోకాన్ని జయించే మన విజయం విశ్వాసమే"నని మనం కొన్ని సార్లు పాడతాం. ఆ విజయం క్రీస్తులోనికి బాప్తిస్మం పొందడంతో ఆరంభిస్తుంది. అక్కడ, విశ్వాసంచేతను, మన పాపముల విషయమై మారుమనస్సు పొందుటచేతను, క్రీస్తు రక్తము మన పాపములను కడిగివేస్తుందనే విశ్వాసముచేతను ఆయన మరణములోనికి బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడతాం (రోమా 6:3, 4). విశ్వాసం ద్వారా మనలను మనం ఆయనకు అప్పగించుకుంటాం – ఆయన మనకొరకు సిలువపై తన్ను తాను అప్పగించుకొన్నట్టే. విశ్వాసముచేత ఆయన కృపాహస్తాన్ని మనం పట్టుకొనినప్పుడు, మన పాపములనుండి రక్షింపబడినవారమౌతాం మరియు ప్రభువునందు విశ్వాసముతో నూతన జీవితాన్ని జీవింపనారంభిస్తాం:

> పైనున్న యేసునందు విశ్వాసంవలన జీవించు
> ఆయన గొప్ప ప్రేమయందు నమ్మికయుంచుతూ రహస్యాలను చెప్పుతూ;
> బలపరచే ఆయన హస్తమునందు సమస్త హానినుండి క్షేమంగా ఉంటూ
> నేను విశ్వాసంవలన జీవిస్తున్నా అపాయ సూచన ఏమీ తలంపులోనికి రాకుండ.[1]

క్రైస్తవజీవితం "పైనున్న యేసునందు విశ్వాసంవలన జీవించే జీవితమైయుంది."

మారుమనస్సు, యేసు మరణంలోనికి బాప్తిస్మాన్ని వెంబడించుతూ, విశ్వాస

సంబంధమైన మంచి పోరాటం పోరాడడానికి ఆయన బలమును పొందేలా ప్రభువైన యేసునందు నమ్మికయుంచేలా అనుదినము మన విశ్వాసం వృద్ధిపొందుతుంది. ఒకరోజున కడపటి శత్రువైన మరణాన్ని ఎదుర్కొంటాం. మనం ఎలాటి ధైర్యముగల నమ్మికతో జీవించామో అదే విశ్వాసంతో చనిపోతాం. ప్రభువైన యేసు “మరణమును నిరర్థకముచేసి జీవమును అక్షయతను సువార్తవలన వెలుగులోనికి తెచ్చెను” అని 10వ వచనంలో పౌలు చెప్పాడు. క్రీస్తు మన పాపముల నిమిత్తం సిలువపై మరణించడం మాత్రమే గాక, “లేఖనముల ప్రకారము ఆయన మూడవదినమున లేపబడెను” అని సువార్త సందేశం మనకు అభయమిచ్చింది (1కొరింథీ. 15:4). ఆయన సిలువవేయబడిన తరువాత మృతులలోనుండి లేపబడ్డాడని విశ్వాసంవలన అంగీకరిస్తున్నాం, ఈ విధానంలో ఆయన మరణాన్ని నిరర్థకం చేశారు. విశ్వాసంవలన జీవించే దేవుని బిడ్డకు, మరణం ఓడించబడిన శత్రువే. మనమందరం ఎప్పుడో ఒకప్పుడు భౌతికంగా మరణించినా, మరణముయొక్క శక్తి తొలిగింపబడినందున, దేవుని బిడ్డను ఎవడు కప్పిపెట్టలేడు. మన భౌతికమైన దేహాన్ని సమాధి చేయవచ్చుననుకో, క్రైస్తవుని ఆత్మ ప్రభువుతో కూడ ఉండడానికి వెళ్లుతుంది. ప్రభువైన యేసు మరల ప్రత్యక్షమైనప్పుడు, “క్రీస్తునందు మృతులైనవారు మొదటలేతురు” (1 థెస్స. 4:14) నేడు విశ్వాసంతో మనం వేటిని అంగీకరిస్తున్నామో అప్పుడు నేరుగా కండ్లతో చూస్తాం. కడపట నశింపజేయబడు శత్రువు మరణమని 1 కొరింథీ. 15లో పౌలు వ్రాశాడు (26 వ.). “నిమిషములో కనురెప్పపాటున ... కడబూర ... మ్రోగును, అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు, మనము మార్పు పొందుదుము” (52 వ.). ఇక్కడ మనము అనుదినము సాతాను సైన్యంచేత చుట్టబడుతూ ఉంటాం. వ్యాధి, విడాకులు, డ్రగ్స్, నాశనం, మరణం అనేవి కేవలం కొన్ని ఉదాహరణలు. మన ప్రభువుయొక్క రెండవ రాకడలో ఈ శత్రువులన్నీ శాశ్వతంగా నాశనం చేయబడతాయి, చివరిగా పడిపోయే శత్రువు, అన్నిటికంటే బలమైన శత్రువు మరణం.

దేవుని సైన్యంలోని ప్రతి సైనికుని పౌలుయొక్క మాటలు బలపరచాలి. పరిశుద్ధాత్మ యొక్క ప్రేరేపణచే, ఈ జీవితకాలంలో మనం ఎదుర్కొనే శత్రువులందరి మీద విజయం, చివరికి మరణమనే శత్రువుతో సహా, ప్రభువైన యేసుక్రీస్తునందు ఉన్నదని పౌలు మనకు ధైర్యాన్నిచ్చాడు. మనం ఎన్నడు వదులుకోకూడదు! మనం ధైర్యంగాను, నమ్మకంతోను ఉండడానికి ప్రతి కారణం ఉంది, అంతిమ విజయం ప్రభువుచే సాధింపబడి, తన సైన్యంలో పోరును కొనసాగించిన ప్రతివానితో ఆ ఫలితాలను ఆయన పంచుకుంటాడు. ఇట్టి నమ్మికకు కారణాన్ని పౌలు మూల వాక్యంలో యిచ్చాడు: “... నమ్మినవాని ఎరుగుదును గనుక సిగ్గుపడను; నేను ఆయనకు అప్పగించినదానిని రాబోవుచున్న ఆ దినమువరకు ఆయన కాపాడగలడని రూఢిగా నమ్ముచున్నాను” (12 వ.) “నేను నమ్మినవాని ఎరుగుదును” అని పౌలు వ్రాసిన దానిని గమనించు (ఒత్తి పలకడం నాది). ప్రభువైన యేసుక్రీస్తునందు కేంద్రీకరింపబడిన గొప్ప విశ్వాసం పౌలుకుంది. ప్రభువైన యేసు అతని విశ్వాసానికి గురి గనుక సిలువ యోధునిగా పౌలుకు గొప్ప ధైర్యముంది.

దేవుడు ఆదామును సృజించినప్పుడు, ఆయన అతనిని ఆత్మసంబంధమైన తన స్వరూపంలోనే చేసికొన్నాడు. నరుడు దేవుని స్వరూపంలో చేయబడినందున, విశ్వసించగల వింతైన లేక ప్రత్యేకమైన సామర్థ్యం కలిగినవాడైయున్నాడు. ఎవనిమీదనో లేక దేనిమీదనో విశ్వసించగల శక్తి మనలో ప్రతి ఒక్కనికి ఉంది, మనలో ప్రతి ఒక్కరు ఆ వ్యక్తియందుగాని లేక ఆ వస్తువునందుగాని మన విశ్వాసం నిలుపుకొంటూ ఉంటాం. అనేకులు తమయందే నమ్మికయుంచుకుంటారు, తమ సొంత మానవ తత్వ జ్ఞానమునందు నమ్మికయుంచుకుంటారు, తమ సొంత మానవ జ్ఞానమునందు బలమునందు, ఇతరులు ప్రజలయందును, రాజకీయములందు, లేదా మానవ తత్వ జ్ఞానమునందు నమ్మికయుంచుతారు. పౌలు విశ్వాసమైతే ప్రభువైన యేసునందు ఉంచబడింది. ప్రభువే తన విశ్వాసానికి ఏకైక గురియైనందున, అంతమువరకు పౌలు బలమైన, ధైర్యముగల, నమ్మికగల సైనికుడై యుండగలిగాడు. కోట్లకొలదిమంది జనులు సంఘ కూడికలకు ఎల్లప్పుడు హాజరౌతునే ఉంటారు, కాని యింతకు క్రైస్తవ్యం అంటే ఏమో ఎరుగరు! క్రైస్తవ్యం క్రీస్తేనన్న సంగతిని వారు ఎన్నడు గ్రహింపరు. క్రైస్తవ్యం క్రీస్తును ఎరుగవచ్చేది, క్రీస్తును ప్రేమింప నేర్చుకునేది, క్రీస్తును సేవింపబూనేది, చివరి గాలి పీల్చి నిత్యము ప్రభువుతో ఉండబోయేవరకు క్రీస్తు యొక్క పనిని కాపాడపోరాడేదే.

ఫిలిప్పీ. 1:21లో పౌలు యిలా వ్రాశాడు, "నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము." ఈ జీవితంలో పౌలును నడిపించే ఒకే దివ్యమైన వాంఛ, ఆ వాంఛ ప్రభువైన యేసే. రోమా 14:8లో పౌలు యిలా రాశాడు: "మనము బ్రదికినను ప్రభువు కోసమే బ్రదుకుచున్నాము; చనిపోయినను ప్రభువు కోసమే చనిపోవుచున్నాము. కాబట్టి మనము బ్రదికినను చనిపోయినను ప్రభువువారమై యున్నాము." పౌలు యొక్క జీవితం ప్రభువైన యేసు క్రీస్తుమీద అంతగా కేంద్రీకరింపబడియున్నందున, ప్రభువునందు ధైర్యముగలిగి అతడు బ్రతికాడు. అతని నమ్మిక ప్రభువునందు ఉన్నందున, పౌలు మరణాన్ని భయంగాని, దుఃఖముగాని లేకుండ ఎదుర్కోగలిగాడు. "నా జీవితం యేసే, గనుక నా మరణం లాభం, నేను యేసుకొరకు జీవిస్తా, నేను మరణించినప్పుడు, యేసుకొరకు చనిపోతా; గనుక, నేను బ్రతికినా చనిపోయినా, ప్రభువువాడనే. నేను నమ్మినవానిని నే నెరుగుదును. నేను ఆయనకు అప్పగించినదానిని ఆ దినంవరకు ఆయన కాపాడగలడని" అతడు చెప్పగలడు. విశ్వాస సంబంధమైన మంచి పోరాటం పోరాడుతున్నట్టయితే, మన దృష్టిని మన సైన్యాధిపతియైన యేసు క్రీస్తు ప్రభువుమీద కేంద్రీకరించవలసియుంది. ప్రభువే మన పరిశుద్ధత, ప్రభువైన యేసు మన విమోచకుడు, గనుక "అతిశయించువాడు ప్రభువునందే అతిశయింపవలెను" (1 కొరింథీ. 1:30, 31).

"నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే"యని పౌలు అన్నాడు. నీవును అదే ప్రతిపాదనను చేయగలవా, లేక క్రీస్తు గాక మరి దేని కొరకైనా నీవు జీవిస్తున్నావా? నేడు ఈ ఖాళీని నీవు ఎలా పూరించుతావ్? "నా మట్టుకైతే జీవించేది డబ్బుకొరకే"; "నా మట్టుకైతే బ్రదుకుట విద్యకొరకే"; "నా మట్టుకైతే జీవించేది క్రీడలకొరకే" అని నీవు అంటావా? ఆ

ఖాళీలో "ఉల్లాసంకొరకు," "సంతోషపరచుకొనడం కొరకు" లేక ఈ జీవన సంబంధమైన వ్యాపారాలలో ఏదో యొకదానికొరకని నీవు పూరించుతావా? ప్రభువైన యేసును తప్ప ఆ ఖాళీలో నీవు దేన్ని పెట్టి పూరించినా, "చావైతే లాభమని" చెప్ప వీలుండదని మన మందరం హెచ్చరింపబడదాం. మనం ఆయనవారము, ఆయన మన ప్రభువు అనే వాస్తవం తప్ప మరేది ప్రాముఖ్యం కాకుండేలా ప్రభువైన యేసునందు మన దృష్టిని కేంద్రీకరించుదాం! పౌలుయొక్క మాదిరిని మనం అనుసరించుతూ, అతనితో కలిసి, "నా జీవితాన్ని ప్రభువైన యేసుక్రీస్తునందు ఎంతగా కేంద్రీకరించుతానంటే, నా శరీర, ఆత్మ, ప్రాణములు నిరంతరం ఆయన కాపుదలకు భద్రతకు అప్పగిస్తాం! నా జీవితాన్ని ఆయన చేతులకు అప్పగించుతూ ఉండగా, ముఖా ముఖిగా ఆయనను చూచి, ఆయనతో నిత్యత్వంలో ప్రవేశించేవరకు నేను ఆయనకు సమర్పించిన ప్రతి దానిని కాపాడగలడని నమ్ముతున్నానని చెప్పుదాం!"

## ముగింపు

క్రీస్తునకు సమర్పించడంలోనే జీవము, సమాధానము, మరియు సంతోషము ఉంది. ఇకను వేరే మార్గంలేదు. మన హృదయాలలో ప్రభువైన యేసును ఎరుగకుంటే ప్రాముఖ్యమైనదేదీ ఈ లోకంలో లేదు. అనేకమంది ప్రజలు – ఆయన జీవితం, మరణం, సమాధి, పునరుత్థానంలో తండ్రియొద్దకు ఆరోహణం, అనేవాటిని గూర్చి ఎరుగుదురు – కాని యేసునే మనలో ఎంతమంది ఎరుగుదురు? "నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే" అని పౌలుతో కలిసి చెప్పేలా మనలో ఎందరు తమ జీవితాలను సమర్పించుకున్నారు? నేను రాత్రులందు పరుండబోయేటప్పుడు నా చివరి ఆలోచన ప్రభువైన యేసేనా? ఉదయమున యేసు, సాయంకాలమున యేసు, దినమంతయు యేసేనా! "నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే!"

క్రీస్తు మనకు జీవమైయున్నాడని మనం నిజంగా చెప్పగలిగినట్టయితే, ఈ జీవితం రణరంగమని మనకు తెలుసు. మనం ప్రభువుకొరకు జీవిస్తుంటే, అపవాది మనలను ఎదిరిస్తాడు, అడ్డగిస్తాడు. మన విశ్వాసం ప్రభువునందు నిలుపుదాం. అప్పుడు విశ్వాస సంబంధమైన మంచి పోరాటాన్ని మనం పోరాడగలం. దేవుని శక్తివలన ప్రభువైన యేసునందు మన రక్షణ కాపాడబడుతుందని, కడపట నశింపజేయబడు శత్రువైన మరణం కాళ్ల క్రింద త్రొక్కబడేవరకు మనపై లేచే ప్రతి శత్రువును ప్రభువునందు మనం జయిస్తామని ధైర్యముగా ఉండగలం!

---

సూచన

[1]James Wells, "Living By Faith." This hymn, last copyrighted in 1946, appeared in R. E. Winsett's "His Voice in Song."